క్లుప్తంగా

బాలుర కేసులను త్వరగా పరిష్కరించాలి




బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న బాలుర కేసులు త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ న్యాయవాదులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక శనివారపేటలోని ప్రభుత్వ బాలురు వసతి గృహాన్ని సందర్శించారు. ప్రతినెలా తనిఖీల్లో భాగంగా బాలుర వసతి గ్రహాన్ని సందర్శించినట్టు రత్నప్రసాద్ తెలిపారు. బాలురకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, వైద్య, విద్యా సదుపాయాలపై ఆరా తీశారు. ఇతర సౌకర్యాలనూ అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవల్లి, డీపీఓ మోహనరావు న్యాయవాదులు టి.వెంకటేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉచిత ప్రయాణం హుళక్కేనా?

మహిళల్లో ఆగ్రహం





దెందులూరు: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల సమయంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేశారు. టీడీపీ కూటమి నేతలు అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా హామీల అమలుకు చర్యలు తీసుకోవడంలేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా ప్రభుత్వాలు ఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేశాయి. తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేసింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తిచేసుకున్నా ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు నేటికీ కార్యరూపం దాల్చలేదు.

అమలుపై స్పష్టత ఏదీ?

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు రవాణ శాఖ మంత్రి త్వరలోనే అని చెప్పడం తప్ప.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత లేదు. గతేడాది ఆగస్టు 15 నుంచి అని, తర్వాత మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని ప్రసారం జరిగింది. చంద్రబాబు మాత్రం సూపర్ సిక్స్ హామీలిచ్చాం కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తోందని వ్యాఖ్యానించడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీ మరిచారా?

ఏలూరు నియోజకవర్గంలో దాదాపు 2 లక్షల మంది పైగా జనాభా ఉన్నారు. అందులో 18 ఏళ్ల పైబడిన మహిళలు 1,25,810 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. రోజూ సగటున 40 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళ ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారు. తీరా గెలిచాకా హామీలను పట్టించుకోవడం మరిచారు.

మోసపోయిన మహిళలు



ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలపై సాధ్యాఅసాధ్యాలపై ఆలోచన చేయాలి. గెలిచి, అధికార పీఠంలో కూర్చున్నాక హామీలు అమలు చేయాలంటే భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు భయం కనిపించలేదు. టీడీపీకి ఓటు వేసి మహిళలు మోసపోయారు.

– మండలి సరస్వతి, జెడ్పీటీసీ, ఏలూరు రూరల్

అగ్గిపుల్లపై బాబూ జగ్జీవన్ రామ్



ఏలూరు (టూటౌన్): అగ్గిపుల్లపై మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రాన్ని రూపొందించి ఔరా అనిపించారు సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు. ఈ నెల 5న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ–2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, పూర్తి వివారాలకు ఫోన్ నెంబర్ 86861 80018లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించం



ఆటో డార్లింగ్ లైట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఉప రవాణా వాహన తనిఖీ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం వారు స్థానిక జంగారెడ్డిగూడెం రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. 48కి పైగా ఆటోలకు అమర్చిన 63 డార్లింగ్ లైట్లను తొలగించారు. డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. గత నెల నుంచే వాహన తనిఖీ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి ఆటోలకు, ఇతర వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను, లౌడ్ హారన్లను, లౌడ్ స్పీకర్లను తొలగిస్తున్నారు. కొన్ని వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు డీటీసీ కరీమ్ తెలిపారు. తనిఖీల్లో వాహన తనిఖీ అధికారులు పి.రమేష్ బాబు, ఎస్ నెహ్రూ, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

సత్రంపాడు హైస్కూల్‌లో సదుపాయాల లేమి

విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు సత్రంపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయకృష్ణ తెలిపారు. హైస్కూల్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించామన్నారు. వంటశాల లేక సిబ్బంది ఆరుబయటే వంట చేస్తున్నారని, వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాడు – నేడు పథకంలో నిర్మించిన నీటి శుద్ధి యంత్రం పనిచేయకపోవడంతో ఆ గదికి తాళం వేశారని, విద్యార్థులకు స్టీల్ డ్రమ్ముల్లో తాగునీరు ఏర్పాటుచేశారని చెప్పారు. స్టీల్ డ్రమ్ముల్లో నీరు కలుషితమవుతుండడంతో విద్యార్థులు ఇళ్ల నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. స్కూలు వద్ద శుభ్రత లేదని, 700కు పైబడి విద్యార్థులు చదువుకుంటున్న ఈ స్కూల్‌కు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ గాని లేదరని వివరించారు. బోధన సిబ్బంది వీలు కుదిరినప్పుడు మధ్యాహ్న భోజన పథకం రికార్డులు రాస్తున్నారని, ఉన్న సిబ్బంది పరీక్ష పేపరు మూల్యాంకనం విధులకు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని విజయకృష్ణ తెలిపారు.



మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న విజయకృష్ణ

● గేటు దూకాల్సిందేనా !



ఏలూరు నగర నడిబొడ్డున ఉన్న ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఆటలు ఆడుకోవడానికి ఇటీవల అనుమతులు తప్పనిసరి చేశారు. గేటు మూసివేస్తున్నారు. దీంతో విద్యార్థులు క్రికెట్ ఆడుకోవడానికి భారీ గేటు దూకి స్టేడియం ప్రాంగణంలోకి వెళ్లాల్సి వస్తోంది. గేటు ఎక్కి దిగేటప్పుడు జారి పడితే పరిస్థితేంటని పలువురు వాపోతున్నారు. విద్యార్థులు గేటు దూకుతున్న దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

రాములోరి పెళ్లికి పసుపు కొట్టారు



పసుపు కొట్టడానికి రోకలిబండకు పూజ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటిలో ఎవరికైనా పెళ్ళి కుదిరితే పెళ్ళి పనులు ప్రారంభించడానికి ముందుగా పసుపు కొట్టడం తెలుగు ప్రజల ఆచారం. ఇందులో భాగంగానే ఈ నెల 7న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో భక్తులు శుక్రవారం పసుపు కొట్టారు. స్థానిక 40వ డివిజన్ ఫ్రెండ్స్ యూనిటీ సెంటర్ కొత్తపేట శ్రీరామ మందిరం వద్ద శ్రీ భద్రాద్రి సీతారామ స్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ఏడో సోమవారం వరకు వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం పసుపు దంచే కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక భక్తులు మడక లలిత, నరేంద్ర కుమార్ దంపతుల సహకారంతో భక్తులకు తాంబూలం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రవి, ద్వారకా ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి చతుర్ధ కలశారాధన ధ్రువ, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన కన్యాదాతలు కాకుండా 30 మంది దంపతులు కల్యాణంలో కూర్చుంటున్నారని, ఆసక్తి ఉన్నవారు ముందుగా కమిటీకి తెలియజేసి కల్యాణంలో కూర్చోవచ్చని ఆచార్యులు ఆదిత్య తెలిపారు.

రీసర్వేకి రైతులు సహకరించాలి

దెందులూరు: భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం ముప్పవరం గ్రామ సచివాలయంలో రీ సర్వే పై గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు, గ్రామ నాయకులు రైతులు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

న్యాయం చేయాలని గిరిజనుల ధర్నా



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం: 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములకు ఐటీడీఏ కేఆర్‌పురం ఎస్‌డీసీ అన్యాయంగా మరొకరికి తప్పుడు ఆర్డర్లు ఇచ్చారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. జెగ్గిశెట్టిగూడేనికి చెందిన గిరిజనులు కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జెగ్గిశెట్టిగూడెం గ్రామానికి చెందిన ఉనుముల సూర్యచంద్రం వారసులకు చెందిన 36 ఎకరాల భూమి గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్ఎస్ఆర్‌లో కూడా వీరి పేర్లే నమోదయ్యాయన్నారు. అయితే ఇటీవల ఈ భూమికి సంబంధించి ఎస్‌డీసీ వేరే వారికి అక్రమంగా ఆర్డర్ ఇచ్చారని ఆరోపించారు. దీని వలన గిరిజనులకు అన్యాయం జరిగిందని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని నీరుగారుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు బాధిత గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు ప్రారంభం



దెందులూరు: మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. దాదాపు 7432 ఎకరాల్లో సాగు చేయగా అధికంగా పీఆర్126, 1121 విత్తనాలను రైతులు సాగు చేశారు. ఎండలు, కూలీలు కొరత కారణంగా రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. తుఫాను ప్రకటన ఇచ్చిన నేపథ్యంలో త్వరితర పూర్తయ్యేందుకు రైతులు యంత్రాలతో వరి మాసూలు చేయిస్తున్నారు.

భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలుగా గీతాంజలి

భీమడోలు: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలుగా కె.గీతాంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమడోలు మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఇంజేటి విజయ్ అచ్యుతం వ్యవహరించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కరణం మోహనశ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్. గోపాలకృష్ణ, కోశాధికారిగా ఐ.విజయ్ అచ్యుతం, కార్యదర్శిగా లావేటి సుధారాణి, లైబ్రరీ అండ్ స్పోర్ట్స్ కార్యదర్శిగా బీవీడీఎల్ నారాయణ, మహిళా ప్రతినిధిగా టి.రాణి, కార్యనిర్వాహక సభ్యులుగా 10 మందిని ఎన్నుకున్నారు. నూతన సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	26	బీన్స్‌చిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	26	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	26	కంద	76
కాకర కాయలు	30–36	బీట్‌రూట్	30
బీరకాయలు	28	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	32	ఫ్రెంచ్‌బీన్స్	120
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07–10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – తిరుపతి	16.00	4830	29

విద్యార్థులకు స్ఫూర్తి బాబూ జగ్జీవన్‌రామ్



మాట్లాడుతున్న వైస్ ప్రిన్స్‌పాల్ అజయ్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యాభ్యాసం ద్వారా అత్యున్నత స్థానానికి చేరుకోవడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తిగా జగ్జీవన్ రామ్ నిలిచారన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టి.వెంకట దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలుకుతూ భారతదేశం ఆహార గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడానికి దోహదపడ్డారని వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు ఎం రాంబాబు, వి.వెంకట్రావు, ఎస్ పరమేశ, ఎం విజయ కుమార్, పీఆర్ కావ్య శ్రీ, ఎస్ సుస్యలత, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

కోడూరుపాడులో తనిఖీలు



కోడూరుపాడులో బడ్డీ కొట్టును పరిశీలించిన ఎస్సై పి.శివధర్, సచివాలయ ఉద్యోగులు

భీమడోలు: కోడూరుపాడులోని గ్రామకంఠ స్థలంలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపును తొలగించాలని గ్రామస్తుడు పి.దశరథరామారావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన వార్తలకు సంబంధిత అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై పి.శివధర్, ఎక్సైజ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ కె.సుజిని, సచివాలయ వీఆర్ఏ బోసుబాబుతో కలిసి కోడూరుపాడులో తనిఖీలు నిర్వహించారు. మూసి ఉన్న బడ్డీ కొట్టుకు నోటీసులు అంటించారు. గ్రామంలో దాసరి పెద్దిరాజు అనే వ్యక్తి బెల్ట్ షాపును నిర్వహిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. గ్రామాల్లో మద్యం అక్రమ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బి.సత్యనారాయణ హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పెదవేగి : పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం తోలిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమవుతాయని చెఆప్పరు. గణపవరం మండలం పిప్పరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు.

లక్ష గాజుల అలంకరణలో కుంకుళ్లమ్మ



ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 30న ఉగాది పండుగ రోజు ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 7తో ముగియనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని నిత్యం ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారిని ఐదు లక్షల గాజులతో అలంకరించారు. నిత్యం అర్చకులు, పండితులు అమ్మవారికి కుంకుమ పూజలు, చండీ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం విద్యుద్దీపాలంకరణతో కళకళలాడుతుంది.

వన్‌ధన్ కేంద్రాల పరిశీలన

బుట్టాయగూడెం: వన్‌ధన్ కేంద్రాల్లో తయారు చేసిన ఉత్పత్తులను జోడించి తద్వారా ఆదాయం మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం, జిల్లెళ్లగూడెంలో ఏర్పాటు చేసిన వన్‌ధన్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చింతపండు ప్రోసెస్సింగ్ యూనిట్‌ను పరిశీలించి అక్కడ మహిళలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం జీపీఎస్ పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను, పాఠ్యాంశ బోధనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుట్టాయగూడెం సంతమార్కెట్ వద్ద జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన కారం శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ కారం మిల్ ప్రోసెస్సింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. అలాగే పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారం శుద్ధి కేంద్రం ప్రాంగణ స్థలం జీసీసీకే చెందుతుందని చెప్పారు. అయితే ఈ స్థలానికి సంబంధించి తన దృష్టికి వచ్చిందని ఈ స్థలం జీసీసీకే చెందే విధంగా సంబంధిత సర్పంచ్‌తో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ రాజబాబు, జీలుగుమిల్లి వెలుగు ఏపీఎమ్ ఎస్. ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.